క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన మహేందర్

ఎల్కతుర్తి : భార్య కాపురానికి రావడం లేదని మద్యానికి బానిసైన భర్త తీవ్ర మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన వొల్లల మహేందర్(32) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మహేందర్‌కు గత ఐదు సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన జ్యోతితో వివాహం జరిగింది. మహేందర్‌కు రెండు సంవత్సరాల వయస్సు గల కూతురు ఉంది. భార్య జ్యోతి మూడు నెలల క్రితం అనారోగ్యానికి గురి కాగా గర్భవిచ్ఛిత్తి అయ్యింది. దీంతో భార్యభర్తల నడమ గొడవలు జరిగాయి. జ్యోతి తన పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రావడం లేదన్న బాధతో మహేందర్ మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 23వ తేదీన గ్రామంలో ఎల్లమ్మ పండగ జరుగగా బోనాలు ఎత్తుకొని అందరూ ఎల్లమ్మ గుడికి వెళ్తుండగా చూసిన మహేందర్.. తన భార్య బోనాలకు కూడా రాలేదని మనస్థాపం చెందాడు. దీంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తల్లి సరోజన గమనించి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మహేందర్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కమలాపూర్ : మండలంలోని వంగపల్లికి చెందిన నంద నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జై హనుమాన్ ఆటో యూనియన్ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యుడైన నాగరాజు కుటుంబానికి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.18 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, అధ్యక్షుడు కూనూరి రవి, ఉపాధ్యక్షులు మొటం లిగమూర్తి, అంకిల్ల సాంబయ్య, ప్రధానకార్యదర్శి ఆవునూరి తిరుపతి, సహాయకార్యదర్శి దుండ్ర రాజు, కోశాధికారి మేడిపల్లి సారంగం, ఆటో యూనియన్ సభ్యులు పొన్నం సంపత్, దాసరి ధనుంజయ్, కొయ్యడ బాబు, పోడేటి సర్వేశ్వర్, జనగాని భిక్షపతి, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన అనంతుల సుధాకర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్, నాయకులు సారయ్య, ప్రభాకర్ ఉన్నారు.

వాటర్‌ట్యాంకు నిర్మాణానికి కృషి

కమలాపూర్ : మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో శిథిలమై కూలిపోయిన మినీవాటర్ ట్యాంక్‌ను ఎర్రగోళ్ల అశోక్ స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు తిరిగి నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు యువ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. 15 ఏళ్ల క్రితం యువ యూత్ సభ్యుడు అశోక్ మృతి చెందగా స్నేహితుడి జ్ఞాపకార్థం యూత్ సభ్యులందరూ తలోకొంత పోగుచేసి శ్మశానవాటిక వద్ద మినీవాటర్ ట్యాంకు నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ మినీవాటర్ ట్యాంకు పూర్తిగా శిథిలమై కూలిందని అశోక్ కుటుంబ సభ్యులకు తెలుపగా మళ్లీ నిర్మించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. సుమారు రూ.25 వేల వ్యయంతో త్వరలోనే మినీవాటర్ ట్యాంకు నిర్మించనున్నట్లు తెలిపారు. మినీ వాటర్ ట్యాంకు నిర్మాణానికి ముందుకొచ్చిన అశోక్ కుటుంబ సభ్యులకు యూత్ అధ్యక్షుడు మండ అశోక్, ఉపాధ్యక్షుడు చిలుక రాజేందర్, ప్రధాన కార్యదర్శి జక్కు భిక్షపతి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన అశోక్

శాయంపేట : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో గురువారం మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన భారత జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యమకారుల బాధలను కేసీఆర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనాలు

- ఏపుగా పెరిగిన చెట్లు
- శిథిలావస్థకు చేరుకున్న భవనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్ భవనాలు నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి మండల కేంద్రంలో ఒకేచోట మండల కార్యాలయాలు ఉండే విధంగా చొరవచూపి భవనాల నిర్మాణాలకు స్థలం కేటాయించారు. అలాగే 2003వ సంవత్సరంలో నాటి ప్రభుత్వం విద్యార్థుల వసతి కోసం లక్షలు వెచ్చించి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహ భవనం, అదే విధంగా ప్రభుత్వ బాలికల వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హాస్టల్ భవనాన్ని నిర్మించింది. అప్పట్లో పేద విద్యార్థులు హాస్టల్ ఉంటూ చదువుకునేవారు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువు మానేసి రెసిడెన్సియల్ పాఠశాలల్లో చేరారు. అప్పటి నుంచి ఆ హాస్టల్ భవనాలు నిరుపయోగంగా మారాయి. భవనాల చుట్టు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషపురుగులు, జంతువుల స్థావరాలుగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో భవనాల గేట్లు కూడా విరిగిపోయాయి. కాగా ధర్మసాగర్ మండలానికి మంజూరైన సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలకు పక్కా భవనాలు లేకపోవడంతో కొంతకాలం దేవాదుల క్వార్టర్లలో తరగతులను కొనసాగించారు. ఆ తర్వాత దేవాదుల క్వార్టర్లలో సరైన వసతి, సదుపాయలు, సౌకర్యాలు లేనందున ఆ పాఠశాలను హనుమకొండ నగరానికి తరలించారు. దీంతో మండలానికి మంజూరైన బాలికల రెసిడెన్సియల్ పాఠశాలను నగరానికి తరలించడాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు. మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న రెండు హాస్టల్ భవనాల ను మరమ్మతులు చేసి ఆ భవనాల్లో రెసిడెన్సియల్ పాఠశాలను కొనసాగించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.


నిరుపయోగంగా బాలికల హాస్టల్ భవనం


హాస్టల్ చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు

ఉప్పల్‌లో బొగ్గు లారీ బోల్తా

- విరిగిన విద్యుత్ స్తంభాలు, ధ్వంసమైన ఇల్లు


బోల్తాపడిన బొగ్గు లారీ


ధ్వంసమై బొగ్గుతో నిండిన ఇళ్లు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ బొగ్గు లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోగా ఇల్లు ధ్వంసమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి నుంచి ఉప్పల్ కోల్ డంపింగ్ యార్డుకు లారీల ద్వారా బొగ్గు తరలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఓవర్‌లోడ్‌తో బొగ్గు తరలిస్తున్న (టీజీ 07యూ 1338) నంబరు గల లారీని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఉప్పల్ వద్దకు రాగానే లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగాయి. అదే వేగంతో సిరిమల్ల చేరాలుకు చెందిన ఇంటిపైకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇల్లు ధ్వంసమైంది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో చేరాలు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. బొగ్గు లారీల డ్రైవర్లు మద్యం సేవించి ఓవర్‌లోడ్‌తో వస్తున్నారని, ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌లోడ్ బొగ్గు తరలింపును, అతివేగాన్ని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మొక్కుబడిగా చివరి సర్వసభ్య సమావేశం

- పలు శాఖల అధికారులు గైర్హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం : మండల చివరి సర్వసభ్య సమావేశం గురువారం మొక్కుబడిగా సాగింది. స్థానిక రైతు వేదికలో సమావేశం నిర్వహించగా ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఎంపీటీసీలు మాత్రమే ప్రజాప్రతినిధులుగా ఉండడంతోపాటు పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సభ ఖాళీగా కనిపించింది. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో సమస్యలపై నిలదీసే దిక్కు లేకుండా పోయిన పరిస్థితి కనపడింది. ఎంపీటీసీల పదవి కాలం మరో వారం రోజుల్లో ముగియనుండగా వారూ పెద్దగా స్పందించిన దాఖలాల్లేవు. సంగెం చెరువు తూముల మరమ్మతులకు గురయ్యాయని, గవిచర్ల చెరువు కట్ట నుంచి నీరు లీకేజీ అవుతోందని, తిమ్మాపూర్ చెరువు పంట కాల్వ కొట్టుకుపోయిందని సంగెం, గవిచర్ల ఎంపీటీసీలు మల్లయ్య, సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఐబీ ఏఈ హమీద్‌ను నిలదీశారు. ఐసీడీఎస్ వారి పనితీరుపై మహిళా ఎంపీటీసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మరుగుదొడ్డి, కుంటపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు ప్రజాగ్రంథాలయాలు మంజూరయ్యాయని త్వరలో వాటికి గదులు కేటాయిస్తామని ఎంపీపీ చెప్పారు. సంగెం శాఖ గ్రంథాలయానికి భవనం కేయించాలని లైబ్రేరియన్ కోరారు. సంగెం ఎస్సీ, బీసీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటున్న క్రమంలో హాస్టల్‌ను గవిచర్లకు కేటాయిస్తే బాగుంటుందని ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ బాయ్స్ హాస్టల్‌ను ప్రభుత్వ అనుమతితో బాలికలకు కేటాయించాలని తీర్మానించారు. జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ ఓంప్రకాశ్, ఏఓ యాకయ్య, పీఆర్ ఏఈ రమేశ్ కుమార్, పశు వైద్యాధికారి రాజు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ రాక..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం తెలిపారు. వంగరలో దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు జయంతిలో పాల్గొనన్నుట్లు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

వేలేరు : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్థాపం చెందిన విద్యార్థి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పీచర గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గడ్డె అంజికుమార్ ఇటర్మీడియట్ చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన అంజికుమార్ గురువారం ఉదయం పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు


పరకాల : ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేస్తున్న అధికారులు


ఐనవోలు : మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

పరకాల : ప్రభుత్వ నిబంధనలను ధిక్కరిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు హెచ్చరించారు. గురువారం మండల విద్యాశాఖాధికారి ఎస్.రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు నామాని సాంబయ్యతో కలిసి ఆయన ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగితెలుసుకున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆట వస్తువులు, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని సూచించారు. పలు విద్యా సంస్థలపై ఆరోపణలు వస్తున్న దృష్ట్యా ఫీజుల విషయంలో కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ఐనవోలు : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఆల్ ఇండియా పూర్ స్టూడెంట్ యూనియన్, పేదల రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు సింగారం ప్రేమ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సింగారం గ్రామంలో అంబేడ్కర్ కూడలి వద్ద ఆయన మాట్లాడారు. ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుల జేబుకు చిల్లు పెడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, 25 శాతం ఉచిత విద్య అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలకు 50 శాతం మాత్రమే ఫీజు తీసుకుని హాస్టల్ వసతి కల్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. టర్మ్, స్కూల్ డెవలప్‌మెంట్, స్పోర్ట్స్, లైబ్రరీ, డ్రెస్, బుక్స్, వ్యాన్ తదితర పేర్లతో అధిక డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కువ ఫీజులు వసూలు చేసిన కళాశాల, పాఠశాలల అనుమతులు రద్దు చేయాలని అన్నారు. సాంబయ్య, వెంకటేశ్, కుమార్, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య, ప్రవీణ్, జనార్దన్, అనిల్ పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై ప్రధాని స్పందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

నర్సంపేట : నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ స్పందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలన్నారు. లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, రవి, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు గట్టి కృష్ణ, నాయకులు బోగి సారంగపాణి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో పాము పుట్ట

- కనుకదుర్గాదేవిగా భక్తుల పూజలు
- దర్శనమిస్తున్న శ్వేతనాగు
- సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు
- ఆగ్రహిస్తున్న భక్తులు



కనకదుర్గాదేవి ఆలయం


ఆలయం ఎదుట డంపింగ్ యార్డు

ఎల్కతుర్తి : మండల కేంద్రం నకరేశ్వరముగా ప్రసిద్ధిగాంచింది. నకరేశ్వరం అనగా నాలుగు కూడళ్లను కలిపే దారి. వారాంతపు సంత, వ్యాపారం విరివిగా జరిగే ప్రదేశం. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ గ్రామంలోని కెనాల్ సమీపంలో గల నాగులచెరువు వద్ద డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. సరిగా ఈ ఆలయానికి వంద అడుగుల దూరంలో కనుకదుర్గాదేవి ఆలయం ఉంది. ఆ ఆలయంలో ఎలాంటి విగ్రహం ఉండదు. కానీ భువి నుంచి దివికి అంటేలా పాము పుట్టా ఉంటుంది. ఆ పుట్టలో అప్పుడే ఆవునుంచి పితికిన పాలవలె స్వచ్ఛందంగా మెరుస్తూ నాగసర్పం కనిపిస్తుంది. దానిని ఈ ప్రాంత ప్రజలు శ్వేతనాగుగా పిలుస్తారు. ఆషాఢం, శ్రావణ మాసాల్లో ఈ ప్రాంత ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో గుడికి వచ్చి పుట్టలో పాలు పోస్తారు. సంతానం లేని వారు పవిత్ర స్నానాలు ఆచరించి వరాలు పడుతారు. అమ్మవారి ఆలయంలో చెట్టుకు ఊయల కడుతారు. ప్రతి ఇంటి నుంచి వనభోజనాలకు వస్తారు. ముందుగా వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగా పండాలని అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. కోరిన కోర్కెలు తీర్చాలని భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మారుమూల కారడివిలో ఉన్న ఈ ఆలయానికి భక్తులు ఈ రెండు మాసాల్లో పోటెత్తుతారు.

ఆలయం ఎదురుగా డంపింగ్‌యార్డు..

ఈ ఆలయం ఎదురుగానే డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా గొల్ల, కురుమలు ఈ ఆలయాన్ని జాతర జరిగే ముందు శుద్ధి చేస్తారు. ఆలయం ఎదురుగానే డంపింగ్‌యార్డు ఉండటంతో గ్రామస్తులు సైతం మండిపడుతున్నారు. పవిత్రమైన ఆలయం ఎదుట ఈ డంపింగ్ యార్డు ఏంటని ప్రశ్నిస్తున్నారు. వన భోజనాలకు వచ్చే భక్తులు సైతం డంపింగ్‌యార్డు వలన దుర్వాసన వెదజల్లుతుందని ఆగ్రహిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు అతి పవిత్రమైన ఆలయ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును తీసివేయాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.


ఆలయంలోని పుట్ట

వెలగని వీధి దీపాలు.. కమ్ముకున్న చీకట్లు



చెన్నారావుపేట : మండలంలోని జల్లి తండాలో విద్యుత్ దీపాలు వెలుగక పలు వీధులు చీకట్లో మగ్గిపోతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదంటూ తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 రోజులుగా వీధుల్లో రాత్రి వేళల్లో చీకటి రాజ్యమేలుతుండగా సమస్యను పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో రాత్రిళ్లు ఇంట్లోంచి బయటకు రావాలంటే భయంగా ఉంటోందని పలువురు చెప్పారు. వానలకు పాములు, తేళ్లు తిరుగుతున్నాయని, చీకట్లో విషకీటకాల బారిన పడినా గుర్తించే పరిస్థితి లేదని తండావాసులు వాపోతున్నారు.

కుట్టుశిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : ప్రభుత్వం చేపట్టిన కుట్టుశిక్షణతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎంపీడీఓ నర్సింహమూర్తి తెలిపారు. ఆర్‌సెట్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ తెరిస్సా మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని డీపీఎం సుజాతతో కలిసి ఎంపీడీఓ గురువారం ప్రారంభించి మాట్లాడారు. మహిళల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమంలో భాగంగా కుట్టుశిక్షణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో100 రోజుల పనిని పూర్తి చేసిన కుటుంబాల్లోని ఆసక్తి కలిగిన మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సునీత, ఏపీఓ వెంకట్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇనుప చువ్వలు

కాజీపేట అర్బన్ : కడిపికొండ ఆర్వోబీపై ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే వాహనాల టైర్ పంక్చర్ తప్పదు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కడిపికొండ ఆర్వోబీపై ఏర్పడిన గుంతలు, అందులో నుంచి బయటకు వచ్చిన ఇనుప చువ్వలతో కడిపికొండ బ్రిడ్జిపై నుంచి ప్రయాణం అంటేనే వాహనదారులు జంకుతున్నారు. కాజీపేట నుంచి ఖమ్మం బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ బ్రిడ్జిపై నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. కాస్త ఎమరుపాటుగా ఉన్న వాహనాల టైర్లకు ఇనుప చువ్వలు గుచ్చుకుని టైర్ పంక్చర్ అయ్యే ప్రమాదం ఉంది. వేగంగా ఉన్న వాహనాలకు గుచ్చుకుంటే భారీ ప్రమాదమే జరుగుతుందని, తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని కడిపికొండ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మ దహనం


వీసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్ : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్‌వద్ద వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడారు. యూనివర్సిటీలో సుకున్ ఫెస్టివల్ నిర్వహించాలని విద్యార్థి సంఘం నాయకులు, అధికారులను అడిగినప్పటికీ అనుమతి ఇవ్వలేదన్నారు. దీంతో విద్యార్థులతో కలిసి వీసీ లాడ్జ్ ఎదుట నిరసన తెలపగా, పోలీసులను పిలిపించి వారిపై కేసు నమోదు చేయించారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ కమిటీ సెక్రటరీతో పాటు నలుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారని, అలాగే మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10వేల ఫైన్ విధించారన్నారు. అప్రజాస్వామిక పాలనకు పాల్పడిన సెంట్రల్ యూనివర్సిటీ వీసీని వెంటనే బర్తరఫ్ చేయాలని, విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేసి, కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీ జస్వంత్, బాధ్యులు సందీప్, రాజ్‌కుమార్, సుమన్, కుమార్, ప్రవళిక, అనూష పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


గుడుంబా స్థావరాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నెక్కొండ : మండలంలోని చెరువు ముందు తండా, కునుసోతు తండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, సివిల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా స్థావరాన్ని, 1200 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ నర్సంపేట సీఐ నరేశ్‌రెడ్డి మాట్లాడారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐలు రమేశ్ చందర్, నాగయ్య, ఆ శాఖ నర్సంపేట ఎస్సై శిరీష, నెక్కొండ సివిల్ ఎస్సై మహేందర్ పాల్గొన్నారు.

రుణమాఫీ అభినందనీయం

హన్మకొండ అర్బన్ : రైతులకు రూ.2లక్షల రుణమాఫీ నిర్ణయం సాహసోపేతమని తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రుణమాఫీ అమలు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, అభినందిస్తున్నామని పేర్కొన్నారు.

కుంటను తలపిస్తున్న సర్కారు బడి


పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని పెద్దమ్మగడ్డ పాలెం ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు నిలిచి కుంటలా మారింది. ప్రాంగణంలో వర్షపు నీరు నిలవడంతో బురదమయంగా మారింది. విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రతిజ్ఞ చేయడానికి వీలుకాక పోవడంతో నేరుగా తరగతిలోకి వెళ్లారు. ఇక భవనం పైకప్పు పెచ్చులూడుతుండడంతో భయం భయంగా పాఠాలు వింటున్నారు. ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు కొనసాగుతుండగా, మొత్తం 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.